సాక్షి సిద్దిపేట

మంగళవారం । 2 । జూలై । 2024



గుండె గు'బిల్లు'

హుస్నాబాద్‌లో రూ.70 లక్షల వరకు నల్లా బిల్లులు బకాయిలు ఉన్నాయి.

వివరాలు 8లో ▸



బీజేపీని తిరస్కరించిన ప్రజలు

లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీని ప్రజలు తిరస్కరించారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య అన్నారు.

వివరాలు 8లో ▸



విద్యతోనే సామాజిక పురోగతి

విద్యతోనే ప్రజా చైతన్యం సాధ్యమని, పురోగతికి సరైన మార్గమని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సిటీ పోలీస్ యాక్ట్ అమలు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి సిటీ పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని సీపీ అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2 నుంచి ఈనెల 17వ తేదీ వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. నిబంధనలు అమలులో ఉన్న సమయంలో కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. నిర్వహణకు ముందస్తు పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా డీజే సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా ఈ నెల 17 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నేతల రాస్తారోకో

సీఎం దిష్టి బొమ్మ దగ్ధం



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): కొద్ది రోజులుగా దీక్ష చేస్తున్న మోతీలాల్‌ను పరామర్శించేందుకు గాంధీ ఆస్పత్రికి వెళ్లిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఇక్కడే సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ చంటి, నాయకులు బాల్‌నర్సయ్య, శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, మల్లేశం, యెల్లారెడ్డి, రంజితకృష్ణమూర్తి, మానస, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆరు నెలల నుంచి వేతనాల్లేవని, పూట గడవడం కూడా కష్టం అవుతుందని గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు తెలిపారు. సోమవారం కుకునూర్‌పల్లి మండలం రాయవరంలో ఇంటింటా తిరుగుతూ భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరు నెలల నుంచి వేతనాలు రాక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంజేశారు. పిల్లల చదువులు, కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన వస్తుందని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలు విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

01జీజేడబూల్య71: రాయవరంలో భిక్షాటన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ ఏటా ఈ అవార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కల్గిన ఉపాధ్యాయులు ఈనెల 15 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. అనంతరం వాటి జిరాక్స్‌ను ఈ నెల 17లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

డాక్టర్స్ డే వేడుకలు



సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ చందర్, ఇతర వైద్యులు

సిద్దిపేటకమాన్: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల, అనుబంధ జనరల్ ఆస్పత్రిలో డాక్టర్లు సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్, గైనకాలజీ విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ శోభలను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు అపర్ణ, పరమజ్యోతి, అనస్థీషియా విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణచందర్, క్రాంతికుమార్, లక్ష్మి, రాజు, సదానందం, అనుపమ, సురేశ్‌బాబు, వేణు పాల్గొన్నారు.

చెల్లి సలహాతోనే ఈ స్థాయికి..



"ఎంసెట్‌లో ఒక్క మార్కుతో ఎంబీబీఎస్ సీటు రాలేదు. దీంతో బీఎస్సీ అగ్రికల్చర్, వెటర్నరీలో చేరి డాక్టర్‌గా కెరీర్ ప్రారంభించాను. ఆ సమయంలో చెల్లి గ్రూప్–1కు ప్రిపేర్ అవుతూ నన్ను కూడా ప్రోత్సహించింది. అప్పటికి నాకు ఆ ఆలోచన లేదు. నా భర్త, అత్త ప్రోద్బలంతో మూడు నెలలు పాటు ఉద్యోగానికి సెలవు పెట్టి గ్రూప్‌నకు సిద్ధమయ్యాను. కష్టపడిన దానికి ఫలితం దక్కింది. 11వ ర్యాంక్ సాధించాను. అయితే పెళ్లికి ముందు ట్యూషన్ పెట్టించి అమ్మ చదివించగా.. తర్వాత అత్తమ్మ ఎంతో సపోర్ట్ చేసింది. నేను ఈ స్థాయికి రావడానికి నా కుటుంబం సపోర్ట్ ఎంతో ఉంది. కానీ నా సక్సెస్‌ను చూసేందుకు అత్తమ్మ మా మధ్య లేకపోవడం ఇప్పటికీ లోటుగా ఫీలవుతాను" అని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. తాను డాక్టర్ కావాలనుకున్న ఆమె.. ఖాకీ బట్టలు, లాఠీ ఎందుకు పట్టాల్సి వచ్చిందో ఆసక్తికర విషయాలను సాక్షితో పంచుకున్నారు. ఆమె మాటల్లోనే..

టర్నింగ్ పాయింట్

- ఎంసెట్‌లో ఒక్క మార్కుతో ఎంబీబీఎస్ సీటు రాలేదు
- వెటర్నరీ డాక్టర్‌గా తొలి సేవలు
- గ్రూప్–1లో 11వ ర్యాంకు సాధించా
- డాక్టర్ కావాలనుకున్నా.. ఆ కోరికను పిల్లలు తీర్చారు
- సిద్దిపేట పోలీసు కమిషనర్ డాక్టర్ అనురాధ

సాక్షి, సిద్దిపేట: మాది నల్గొండ జిల్లా గుర్రంపోడు. అమ్మానాన్నల పేర్లు జగన్మోహన్‌రెడ్డి, కమల. నాన్న డిప్యూటీ డైరెక్టర్ అగ్రికల్చర్‌గా పని చేసి రిటైర్డ్ అయ్యారు. అమ్మ హౌస్‌వైఫ్. మేము నలుగురం సంతానం. నల్గొండలో లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్‌లో ప్రైమరీ విద్య. ఇక్కడే అన్నయ్య 4వ, నేను 3వ, చెల్లి 2వ తరగతి చదువుతున్న సమయంలో ముగ్గురం ఒకే అకాడమిక్ ఇయర్‌లో మొదటి ర్యాంక్ సాధించాం. అప్పుడు ఒకే స్టేజీ మీద మా ముగ్గురితో పాటు అమ్మ నాన్నలను పిలిచి మమ్మల్ని అభినందించారు. ఆ క్షణాలను ఇప్పటికీ మరచిపోలేను. అన్నయ్య నరోత్తమ్ రెడ్డి స్ఫూర్తితో కలిసి నేనూ ఎంసెట్ రాశాను కానీ ఒక్క మార్కుతో ఎంబీబీఎస్ రాలేదు. తర్వాత బీఎస్సీ అగ్రికల్చర్‌లో ఆతర్వాత వెటర్నరీలో జాయిన్ అయ్యాను. ఫైనలియర్‌లో ఉండగా పూణేలో ఎంబీఏ చేసిన బేతి శ్రావణ్ కుమార్ రెడ్డితో వివాహమైంది.

సెలవు పెట్టి ప్రిపేర్ అయ్యా..

నల్గొండ జిల్లా బీబీనగర్‌లో వెటర్నరీ డాక్టర్‌గా ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. మా ఫ్యామిలీలో ఎవరూ వెటర్నరీ డాక్టర్‌గా పని చేసిందిలేదు. ఇంకా ఏమైనా ప్రజలకు మరింత సేవ చేయాలని అనుకుంటున్న సమయంలో నా చెల్లి రాధారెడ్డి గ్రూప్–1 రాస్తూ, నన్ను కూడా రాయమని సలహా ఇచ్చింది. నాకు అప్పటి వరకు గ్రూప్–1 అనే ఆలోచననే రాలేదు. నా భర్త, అత్తమ్మలను అడిగాను ఓకే చెప్పడంతో 3 నెలల పాటు ఉద్యోగానికి సెలవు పెట్టాను. మా ఇంట్లోనే చెల్లి నేను ప్రిపేరయ్యాం. ఆ సమయంలో మా అత్తమ్మ ఎంతో ప్రోత్సహించింది. కాగా, గ్రూప్ వన్ ఫలితాల్లో నేను 11వ ర్యాంక్ సాధించాను. డీఎస్పీగా శిక్షణ పూర్తి అయ్యాక సైబర్ క్రైం ఏసీపీగా తొలి పోస్టింగ్. ఆ తర్వాత శంషాబాద్ ఏసీపీ, సైబరాబాద్ అడిషనల్ డీసీపీ, మహబూబ్‌నగర్ ఎస్పీ, వరంగల్ కమిషనరేట్ వరంగల్ ఈస్ట్ డీసీపీ, రైల్వే ఎస్పీ, రాచకొండ సైబర్‌క్రైం డీసీపీగా విధులను నిర్వర్తించాను.

మరిచిపోలేని ఘటనలు



ఏసీపీ శంషాబాద్‌గా పని చేస్తున్నప్పుడు ఓ కేసు వచ్చింది. 'ఒక తల్లి మైనర్లయిన తన ఇద్దరు కూతుళ్లను ఇతరులతో లైంగిక చర్యలో పాల్గొనాల్సిందిగా బలవంతం చేస్తున్న అంశం టీచర్ల ద్వారా అప్పటి సీపీకి ఫిర్యాదు అందింది. ప్రత్యేకమైన కేసు కావడంతో నా పరిధి కాకపోయినా విచారణ బాధ్యతలు నాకు అప్పగించారు. సున్నితమైన అంశం కావడంతో మూడు నెలల పాటు వారితోనే ఉంటూ, భోజనం కూడా వారితోనే చేస్తూ బలమైన సాక్ష్యాధారాలతో 2017లో కేసు ఫైల్ చేశాను. తల్లితో సహా పెద్దలు ఐదుగురికి జీవిత ఖైదీగా, నలుగురికి జువైనల్ ప్రొబెషనరీ శిక్ష వేస్తూ 2020లో కోర్టు తీర్పు ఇచ్చింది. అలాగే బాధితులిద్దరికి చెరొక రూ.10లక్షల చొప్పున పరిహారాన్ని అందించాలని తీర్పు వచ్చింది. ఈ తీర్పు నా కెరీర్‌లో మర్చిపోలేనిది. అలాగే సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలానికి చెందిన 70 సంవత్సరాల వృద్ధుడికి సంబంధించిన భూమి సమస్య 40 ఏళ్లుగా పరిష్కారం కాలేదు. నాకు వచ్చి ఫిర్యాదు చేస్తే స్థానిక ఏసీపీ, సీఐలకు సమాచారం అందించాను. సమస్య పరిష్కారం కావడంతో స్వీట్ తీసుకుని రావడంతో చాలా సంతోషంగా అనిపించింది.

నా అభ్యున్నతికి కుటుంబం దోహదం

ఇవాళ నేను ఉద్యోగం చేస్తున్నానంటే దానికి కారణం నా కుటుంబమే. నా కూతురు, కుమారుడు, భర్త ఎంతో మద్దతిచ్చారు. కానీ నా సక్సెస్‌ను చూసేందుకు మా అత్తమ్మ మా మధ్య లేకపోవడం ఇప్పటికీ లోటుగా ఫీలవుతాను. నేను ఈ స్థాయి రావడానికి ఐదు పిల్లర్లు అయిన అమ్మ, అత్తమ్మ, చెల్లి, కూతురు, భర్త అలాగే మా ఫ్యామిలీ కూడా ఎంతో కృషి ఉంది. నాకేదైనా సమస్య వస్తే ఫస్ట్ ఫోన్ నా తమ్ముడు అరవింద్ రెడ్డికి చేస్తాను. నాకు ఇద్దరు పిల్లలు సూజిత్ రెడ్డి, ధరణిరెడ్డిలు. కూతురు ధరణి రెడ్డి మెడిసిన్‌లో పీజీ చేస్తోంది. కుమారుడు సూజిత్ రెడ్డి ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. డాక్టర్ కావాలనుకున్న నా కోరికను నా ఇద్దరు పిల్లలు నెరవేర్చారు.



తల్లితో సీపీ అనురాధ

పత్తి చేలపై నివేదిక ఇవ్వండి

- వ్యవసాయ శాఖ అధికారులకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశం
- 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

గజ్వేల్: పత్తి చేలను సందర్శించి ఇక్కడున్న పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ మనుచౌదరి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. 'పత్తి విత్తు నేల పాలు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో పత్తి విత్తు మొలకెత్తని తీగుల్‌లో ఉన్న జోడుమంతల మల్లయ్యకు చెందిన చేనును ఏఈఓ శరణ్య సందర్శించారు. ఈ సందర్భంగా చేనులో ఉన్న మల్లయ్య భార్య లక్ష్మితో మాట్లాడారు. రెండుసార్లు పత్తి విత్తనం వేసినా, మొలవలేదని ఏఈఓ గుర్తించారు. ఈ మండలంలో



పత్తి చేనును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

జూన్ నెలకు సంబంధించి 15 మి.మీల లోటు వర్షపాతం నమోదైంది. దీని వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందని వ్యవసాయ శాఖ గుర్తించింది. అలాగే గంగాపూర్‌లోని రాజబోయిన రమేశ్ పత్తి చేనును మండల ఏఓ నాగేందర్‌రెడ్డి సందర్శించారు. పత్తి విత్తనం మొలకెత్తని విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. మర్కూక్ మండలంలో జూన్‌కు సంబంధించి 30 మి.మీల లోటు వర్షపాతం నమోదైందని గుర్తించారు. భారీ వర్షాలొస్తే విత్తనం మొలకెత్తే అవకాశముందని ఏఓ తెలిపారు.

భూములకు పట్టా ఇవ్వాలని దీక్ష

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో గడ్డమీదిపల్లె రైతులు సోమవారం మా భూములకు పట్టా ఇవ్వాలని ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట దీక్షకు కూర్చున్నారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి విషయం తెలుసుకొని వెంటనే డిప్యూటీ తహసీల్దార్ రుక్మిణి రెడ్డిని వారి వద్దకు పంపించి సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. పాత పట్టాదారు పాసు పుస్తకాలున్నా కొత్త ధరణి రికార్డుల్లో భూ రికార్డుల ప్రక్షాళనలో నిర్లక్ష్యం చేసి మరొక్కరికి మార్చారని ఆరోపించారు. మోక పంచనామా చేసి రికార్డులను సరి చేయాలని అధికారులకు విన్నవించారు. తహసీల్దార్ వెంటనే ఆర్ఐని పోతారానికి పంపించి మోక పంచనామా చేయించారు. భూ రికార్డుల ప్రక్షాళనలో గత అధికారులు తప్పు చేశారని ఇప్పుడు రికార్డులను సవరించే అవకాశం ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందన్నారు. తహసీల్దార్ హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు.

అర్జీలు పునరావృతం కావొద్దు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ప్రజావాణికి 58 అర్జీలు

సిద్దిపేటరూరల్: ప్రజావాణిలో భాగంగా జిల్లా ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోసం అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించి మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను అదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందిస్తున్న అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వచ్చిన సమస్యలను పునరావృతం కాకుండా చూస్తే ప్రజలకు న్యాయం చేసిన వాళ్లమవుతామన్నారు. భూ సమస్యలు, పెన్షన్, ఇళ్ల పలు రకాల సమస్యల పరిష్కారం కోరుతూ మొత్తంగా 58 అర్జీలు వచ్చాయి. డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, అధికారులు పాల్గొన్నారు.

సర్వే చేసి హద్దులు చూపించరూ: బీర్ల సిద్దయ్య

నా పేరు బీర్ల సిద్దయ్య. నాది చేర్యాల మండల కేంద్రం, నాకు చేర్యాల శివారులో సర్వే నంబర్ 848/ఏలో నాలుగు ఎకరాల పట్టా భూమి ఉంది. కాని పొజిషన్‌లో మాత్రం 3 ఎకరాల 30 గుంటలు ఉంది. ఈ విషమయై మండల సర్వేయర్‌కు భూమి సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నాను. దీంతో సర్వేయర్ తన వద్ద భూరికార్డులు అందుబాటులో లేవని చెప్పడంతో జిల్లా సర్వేయర్‌ను సంప్రదించాను, ఆయన కూడా రికార్డులు లేవని చెప్పారు. ఈ విషయంపై అధికారులు స్పందించి నా భూమిని సర్వే చేయించి నాకు ఉండాల్సిన భూమికి సరిహద్దులు పెట్టి న్యాయం చేయగలరు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

పరిహారాన్ని అందించాలి: బీ రమేశ్

నాది మల్లన్నసాగర్ ముంపు గ్రామం వేములఘాట్. ప్రాజెక్టులో భాగంగా ఇల్లు, వ్యవసాయ భూమి ముంపునకు గురైంది. ప్రభుత్వం నిబంధనల ప్రకారం 2019 ఫిబ్రవరి నాటికి 18 సంవత్సరాలు పూర్తయ్యాయి. కానీ నాకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మాత్రం అందివ్వలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి నాకు రావాల్సిన పరిహారాన్ని అందించగలరు.

4 ఏళ్ల నుంచి పుస్తకాలు రావడం లేదు: విద్యార్థుల తల్లిదండ్రులు

మేము బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లితండ్రులం. జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకంలో భాగంగా స్కూల్స్‌లో చదువుకుంటున్న మా విద్యార్థులకు 4 ఏళ్ల నుంచి పుస్తకాలు, యూనిఫాం, షూస్, టై, బెల్టులు రావడం లేదు. ఈ సంవత్సరం స్కూల్స్‌లో చేరిన విద్యార్థుల నుంచి ప్రవేశ రుసుం కింద రూ. 3,800లు వసూలు చేస్తున్నారు. స్కూల్స్‌కు రావాల్సిన బిల్లులను మంజూరు చేయాలి. తల్లితండ్రుల నుంచి తీసుకున్న ఫీజులను సైతం ఇప్పించాలి.



ఎంపీటీసీ సభ్యులను సన్మానించి, వారితో మాజీ మంత్రి హరీశ్‌రావు

పదవులు శాశ్వతం కాదు..

- ప్రజలకు ఏమి చేశామన్నది ముఖ్యం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, ఉన్నప్పుడు ఎన్ని మంచి పనులు చేశామన్నదే ముఖ్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు కీసరి పాపయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఐదేళ్లుగా కష్టపడి ప్రజలకు మంచి సేవలు అందించారన్నారు. సమన్వయంతో పని చేసి గ్రామాలను అభివృద్ధి చేశారన్నారు. కాళేశ్వరం నీళ్లను రెండు పంటలకు అందించిన గొప్ప అవకాశం తమకు లభించిందన్నారు. సాగు నీరు జీవనగతిని, పల్లెల ముఖచిత్రాన్ని మార్చుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీఓ జనార్దన్, సొసైటీ చైర్మన్‌లు కనకరాజు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై చర్చ...

ముందుగా సమావేశంలో మండలంలో పలు అభివృద్ధి పనులు, చేయాల్సిన పనులపై ఆయా శాఖల వారీగా చర్చించారు. పలు శాఖల తీరుపై సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పచ్చి రొట్ట విత్తనాలు, విత్తనాలు అందుబాటులో లేవని సభ్యులు లేవనెత్తారు. విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని సభ దృష్టికి తెచ్చారు. రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సభ్యులు సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు

రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేటజోన్: ఈనెల 14న సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జగన్నాథ రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. మధ్యాహ్నం 3 గంటలకు యాత్ర పట్టణంలో కొనసాగనుంది. కాగా, హరీశ్‌రావు పట్టణంలో జరుగుతున్న పెద్దమ్మ దేవాలయం 15వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. అమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

కొత్త అధ్యాయానికి నాంది

అమలులోకి కొత్త చట్టాలు

- జిల్లాలో 4 కేసులు నమోదు
- ఎక్కడి నుంచైనా ఎఫ్ఐఆర్‌కు అవకాశం



సాక్షి, సిద్దిపేట: దేశ న్యాయ వ్యవస్థలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. బ్రిటీష్ కాలం నాటి చట్టాలు కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో సోమవారం నుంచి కొత్త చట్టాలను అమలులోకి వచ్చాయి. భారత శిక్షా స్మృతి(ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ) స్థానంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎస్ఎస్ఎస్), భారత సాక్ష్యాధార చట్టం(ఐఈఏ) స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ) చట్టాలు వచ్చాయి. పోలీస్ కమిషనరేట్ పరిధిలో రాత్రి 9 గంటల వరకు గజ్వేల్ 1, ములుగు 1, చిన్నకోడూరు 1, హుస్నాబాద్ 1 మొత్తంగా నాలుగు కేసులు కొత్త చట్టం ప్రకారం నమోదయ్యాయి.

కస్టడీ గడువు పెంపు

గత చట్టాల ప్రకారం నిందితుల అరెస్టయిన 14 రోజులలోపే కస్టడీ కోరే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఆ గడువును కొత్త చట్టాల ప్రకారం పొడిగించారు. దీంతో చాలా వరకు కేసుల విచారణ కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుంది. పలు కేసుల్లో పోలీసులకు కస్టడీ కొంత తలనొప్పిగా మారేది. అదే ఇప్పుడు మరింత క్షుణ్ణంగా విచారణ చేసే అవకాశం వారికి లభించింది. జిల్లాలో పెద్ద జైలు అందుబాటులో లేకపోవడంతో చర్లపల్లికి నిందితులను పంపిస్తున్నారు. వీరిని కస్టడీలోకి తీసుకోవాలనుకున్న సందర్భాల్లో పోలీసులు సుదూరం నుంచి నిందితులను అదుపులో తీసుకునేందుకు చాలా వరకు సమయం వృథా అయ్యేది. కొత్త చట్టాల ప్రకారం కస్టడీ సమయాన్ని పెంచారు.

ఆన్‌లైన్ ద్వారా కేసు బదిలీ

జీరో ఎఫ్ఐఆర్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దేశంలోని ఎక్కడ ఎలాంటి ప్రమాదాలు, హత్యలు, అత్యాచారాలు, గ్యాంగ్‌రేప్‌లు ఏ నేరం జరిగినా బాధితులు సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించారు. ఆ స్టేషన్ సిబ్బంది బాధితురాలికి రక్షణ కల్పించి అండగా నిలువనున్నారు. దర్యాప్తు చేసి స్టేట్‌మెంట్లను రికార్డు చేసి బాధితులు నివసించే ప్రాంతంలోని పోలీస్‌స్టేషన్‌కు ఆన్‌లైన్ ద్వారా కేసు బదిలీ చేస్తారు. ఎస్సెమ్మెస్, ఎలక్ట్రానిక్ మధ్యమాలతో సమన్ల జారీ లాంటి అత్యాధునిక పద్ధతులతో కొత్త చట్టాలు న్యాయవ్యవస్థలోకి వచ్చాయి.

ఈ చట్టాలపై అవగాహన అవసరం: సీపీ అనురాధ

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలపై ప్రజలల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఇందులో నేరాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనే విషయం ప్రజలకు తెలియాలి. వాటి గురించి తెలిస్తే నేరాలకు పాల్పడే వారి సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది.

మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వాలి

- డీఎస్సీ పరీక్షను 3 నెలలు వాయిదాకు డిమాండ్
- ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి
- మోతీలాల్ నాయక్‌కు మద్దతుగా నిరుద్యోగుల నిరసన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్రంలో 25 వెల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాల్సిందేనని, సిద్దిపేట జిల్లాకు చెందిన నిరుద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని నిరాహార దీక్ష చేస్తున్న ఓయూ విద్యార్థి సంఘం నాయకుడు మోతీలాల్‌కు మద్దతుగా సోమవారం జిల్లా గ్రంథాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జాబ్‌ల వివరాలు, జాబ్ ప్రకటన, పరీక్ష తేదీలను వివరిస్తూ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలన్నారు. మోతీలాల్ నాయక్ చేస్తున్న దీక్షకు కారణం ప్రభుత్వమేనన్నారు. 25 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీని వేస్తూ, డీఎస్సీ పరీక్షను మూడు నెలలు పాటు వాయిదా వేయాలన్నారు. గ్రూప్–2, గ్రూప్–3 పోస్టులను పెంచాలన్నారు. గ్రూప్–2లో 2వేలు, గ్రూప్–3లో 3వేల ఉద్యోగాలు అదనంగా కలపాలన్నారు. ఈ సారి టెట్ పాసైన వారి సంఖ్య ఎక్కువగా ఉన్నందున చదువుకునేందుకు కనీసం మూడు నెలల సమయం ఇవ్వాలన్నారు. నిరుద్యోగ సమస్యలపై ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్నలు తక్షణమే స్పందించి, ముఖ్యమంత్రితో మాట్లాడి నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో భారీ ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



సిద్దిపేట జిల్లా గ్రంథాలయం ఎదుట నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువత

క్లుప్తంగా

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి,
ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి


రామచంద్రాచారి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): దేశం బాగుపడాలంటే విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు, హెచ్‌ఎం రామచంద్రాచారి పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి క్రిష్ణ, ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు మధు, నారాగౌడ్, ఆర్‌ఎస్.సంతోష్, సుభాష్‌గౌడ్, సత్యనారాయణ, రాజేందర్‌గౌడ్, సంగమేశ్వర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.వీ రవీందర్, బీ.శ్రీనివాస్, మారుతీ, విజయ్‌కుమార్, ప్రసన్న, గోపి, రామక్రిష్ణాగౌడ్, సుభాష్, వెంకటేశం పాల్గొన్నారు.

10 కిలోల కణతి తొలగింపు

మెదక్‌జోన్: కడుపు నొప్పితో బాధపడుతున్న ఓ యువతి కడుపు నుంచి 10 కిలోల కణితిని డాక్టర్ సురేశ్ సోమవారం ఆపరేషన్ చేసి బయటకు తీశారు. టేక్మాల్ మండలం స్లకాన్ కుంట తండాకు చెందిన మూడవత్ బుజ్జి రెండేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతుంది. ఎన్ని ఆస్పత్రులకు తిప్పినా ఫలితం లేకపోయింది. మెదక్ పట్టణంలోని సాయి చంద్ర నర్సింగ్‌హోంలో చేర్పించగా వైద్యుడు సురేశ్ శస్త్రచికిత్స చేసి కణతిని వెలికి తీశాడని కుటుంబీకులు తెలిపారు.

ఫోన్ పోతే దిగులొద్దు

డీఎస్పీ రవీందర్ రెడ్డి


ఫోన్ అందజేస్తున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: మొబైల్ ఫోన్ పోతే దిగులు పడొద్దని సీఈఐఆర్ ద్వారా ఫోన్ ట్రాక్ చేయొచ్చని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సెల్ ఫోన్ పోగొట్టుకున్న ఆరుగురికి ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల మొత్తం ఆరుగురు తమ ఫోన్లను పోగొట్టుకున్నారు. మీ సేవలో ఫిర్యాదు చేయించి, అనంతరం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయించామన్నారు. పోగొట్టుకున్న ఆరు ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేశామన్నారు.

గుండె గుబిల్లు

మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఇచ్చి దాదాపు నాలుగేళ్లు గడిచింది. అప్పుడు ఉచితమన్నారు. ఇప్పుడు నల్లా బిల్లులు చెల్లించాల్సిందేనంటున్నారు అధికారులు. ఇంటి పన్నులాగా ఏ రోజు కూడా నల్లా పన్ను అడగని అధికారులు ఏక మొత్తంలో చెల్లించాలని ఒత్తిడి చేయడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– హుస్నాబాద్

- నల్లా బిల్లుల చెల్లింపుల్లో గందరగోళం
- నాడు ఉచితమన్నారు.. నేడు కట్టాలంటున్నారు
- ఏక మొత్తం చెల్లింపుపై మహిళల ఆగ్రహం
- 6 వేలకు పైగా మిషన్ భగీరథ కనెక్షన్లు
- రూ.70 లక్షల వరకు బకాయిలు


మున్సిపల్ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగిన మహిళలు

హుస్నాబాద్ పట్టణంలో దాదాపు 6 వేలకు పైగానే నల్లా కనెక్షన్లు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా అందించేందుకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. తెలుపు రేషన్ కార్డు ఉండి కొత్తగా నల్లా కనెక్షన్ కావాలన్నవారికి ఒక్క రూపాయి ఫీజు, రేషన్ కార్డు లేని ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ కోసం రూ.100 ఫీజు వసూలు చేశారు. ప్రస్తుతం దాదాపు రూ.70 లక్షల వరకు నల్లా బిల్లులు పాత బకాయిలు ఉన్నాయి. నాలుగేళ్ల నుంచి మున్సిపల్ సిబ్బంది నల్లా బిల్లులు వసూలు చేయకపోవడంతో వినియోగదారులు ఉచితమనే భావించారు. మున్సిపల్ సిబ్బంది ప్రతి నెలా ఇంటి బిల్లులు వసూలు చేస్తున్న సిబ్బంది ఏ నాడు కూడా నల్లా బిల్లులు కట్టాలని వినియోగదారులను అడిగిన దాఖలాలు లేవు. ఇంటి బిల్లులు చెల్లించకుంటే నోటీసులు జారీ చేశారే కానీ నల్లా బిల్లులు కట్టాలని నోటీసులు జారీ చేయకపోవడంతో వినియోగదారులు ఉచితమని చెల్లించకుండా మిన్నకుండి పోయారు.

ఇంటి అవసరాలకు వస్తే బిల్లులు చెల్లించాల్సిందే

ఇంటి అవసరాలకు సంబంధించి పేరు మార్పిడి, దుకాణ లైసెన్స్, పెంకుటిల్లు ఉండి కొత్తగా ఇంటి నిర్మాణ అనుమతి కోసం, ఇతరాత్ర పత్రాల కోసం వస్తే నల్లా బిల్లులు రూ.7 వేలు చెల్లిస్తేనే పత్రాలు ఇస్తామని కండిషన్ పెడుతున్నారు. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ అప్‌గ్రేడ్ వరకు ఉన్న నల్లా బిల్లు బకాయిలను ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. క్రమం తప్పకుండా నల్లా బిల్లులు వసూలు చేయకపోవడంతో ఒక్కసారిగా ఏక మొత్తంలో కట్టాలని ఒత్తిడి చేస్తుండటంతో మహిళలు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాత పైపులైన్లకే కనెక్షన్లు

మిషన్ భగీరథ పథకం అమలులో లేనప్పుడు నల్లా బిల్లులు నెలకు రూ.30 ఉంటే, పథకం వచ్చిన తర్వాత 2020 నల్లా బిల్లులు నెలకు రూ.100 నిర్ణయించారు. కరెంట్ బిల్లు ఏడాదికి రూ.7 వేలు దాటడం లేదని, నల్లా బిల్లులు మాత్రం రూ.7 వేలు విధించి ఆర్థిక భారం మోపుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ఆర్థికంగా ఉన్నవారు ఏక మొత్తంలో చెల్లిస్తుంటే పేదవారు మాత్రం ఆర్థిక స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త కాలనీల్లో మంచి నీటి ట్యాంక్ ద్వారా ఎవరికి వారే పైపు లైన్ వేసుకొని నీటిని వాడుకుంటున్నారు. మిషన్ భగీరథ పేరిట పాత పైపులైన్లకే కనెక్షన్ ఇచ్చి నల్లా బిల్లుల భారం మోపుతున్నారని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1,410 చెల్లించాలన్నారు



నల్లా బిల్లులు రూ.1,410 చెల్లించాలని చెబితే చెల్లించడానికి కార్యాలయానికి వచ్చాం. తీరా రూ.7 వేలు చెల్లించాలని చెబుతున్నారు. ఇంటి బిల్లుల లాగా నల్లా బిల్లులు చెల్లించాలని నోటీస్‌లు ఇవ్వలేదు. నల్లా కనెక్షన్ ఇచ్చినప్పుడే నల్లా బిల్లులు చెల్లించాలని చెబితే మాకు ఇంత భారం పడేది కాదు. నాలుగేళ్లుగా అడుగని అధికారులు ఇప్పుడు ఒత్తిడి తెస్తున్నారు. అవసరమైతే కలెక్టర్ వద్దకు వెళ్లి మొర పెట్టుకుంటామే తప్ప ఏకమొత్తంలో నల్లా బిల్లులు చెల్లించలేం.

– రేణుక, బస్ డిపో కాలనీ, హుస్నాబాద్

ఏనాడు ఉచితం అనలేదు



మిషన్ భగీరథ పథకం రాక ముందు ఉన్న పాత బకాయిలు రూ.1,410 చెల్లించాలని చెప్పాం. నల్లా కనెక్షన్లు ఆన్‌లైన్ చేశారు. తప్పకుండా నీటి బిల్లులు చెల్లించాలి. పథకం ప్రారంభం నుంచి ఉన్న పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం సీడీఎంకు పంపిస్తాం. ఉన్నతాధికారులు ఏ నిర్ణయం తీసుకుంటే ఆ విధంగా నడుచుకుంటాం. మేము ఏనాడు ఉచితం అని చెప్పలేదు.

– మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

అక్రమ కట్టడాలను కూల్చివేయాలి

- ప్రభుత్వ భూమి కబ్జా చేసి నిర్మాణాలు
- కలెక్టరేట్ ఎదుట వెల్దుర్తి గ్రామస్తులు, రైతులు నిరసన

మెదక్ కలెక్టరేట్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు తప్పుడు సర్వే నంబర్లు చూపుతూ పనాది భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేశారు. వాటిని వెంటనే కూల్చి ఆ స్థలాన్ని గ్రామ పంచాయతీకి అప్పగించాలని వెల్దుర్తి మేజర్ గ్రామస్తులు, రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ధర్నా నిర్వహించిన కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వెల్దుర్తి వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. వెల్దుర్తి మండల కేంద్రంలో 22.33 సర్వే నంబర్‌లో 2.39 ఎకరాలు ఉండగా దీన్ని కబ్జా చేశారు. ఇదే సర్వే నంబర్ పేరుతో మరో 1.16 ఎకరాలు చూపి దాన్ని కూడా కబ్జా చేశారు. ఆ స్థలంలో 40 షట్టర్లు నిర్మించారు. ఈ పనాది ద్వారా దేవతుల చెరువు నుంచి 150 ఎకరాల వ్యవసాయ పొలాలకు సాగునీరు అందేది. పనాది భూమి కబ్జాకు గురి కావడంతో పొలాలన్నీ బీళ్లుగా మారాయని తెలిపారు. ఈ విషయమై ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నా.. టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అక్రమార్కులకు అండగా నిలబడటంతో ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. మరో వైపు ప్రస్తుతం శిఖం భూమిని కూడా కబ్జా చేసి మట్టితో నింపుతున్నారని, అడ్డుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ రైతులు శివ్వాగౌడ్, యాదగిరి, నరేందర్ రెడ్డి, మహేశ్ రెడ్డి, మైసయ్య, కుమార్, రాములుతో పాటు పెద్ద ఎత్తున గ్రామ రైతులు పాల్గొన్నారు.

బీజేపీని తిరస్కరించిన ప్రజలు

- ప్రతిపక్షం లేకుండా ఇష్టారాజ్యంగా దేశాన్ని పాలిద్దామనుకున్నారు
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

కొమురవెల్లి(సిద్దిపేట): ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీని ప్రజలు తిరస్కరించారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు రవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ 400 సీట్లు సాధించి ప్రతి పక్షంలేకుండా తన ఇష్టారాజ్యంగా దేశాన్ని పాలించేందుకు సిద్ధమైన నేపథ్యంలో ప్రజలు వారిని తిరస్కరించారని అన్నారు. రైతాంగం సాగించిన పోరాటం ఫలితంగా ఉత్తరాది రాష్ట్రాల్లో అనేక నియోజక వర్గాల్లో బీజేపీ చిత్తుగా ఓడిపోయిందని అన్నారు. దేశంలో ఇండియా కూటమి బలంగా ఉందని కేంద్రం మెడలు వంచి మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజా సమస్యల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో శిక్షణ తరగతులు క్షేత్ర స్థాయిలో పేద ప్రజల సమస్యల పరిష్కారానికి వేదిక అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, కాముని గోపాల్, బద్దిపడగా కృష్ణారెడ్డి, అత్తిని శారద, బండకింది అరుణ్‌కుమార్, తాడూరి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత


గంజాయిని చూపుతున్న పోలీసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆటోలో గజాయిని తరలిస్తున్న ఓ ముఠాను రామచంద్రాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని ఆసిఫ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎండీ. ఇస్మాయిల్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గతంలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. జైలులో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గణపతితో పరిచయం ఏర్పడింది. అతడి ద్వారా గంజాయి తెప్పించుకొని పటాన్‌చెరు ప్రాంతంలోని కార్మికులకు అమ్ముతున్నాడు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఖాసీంతో కలిసి అదే ప్రాంతానికి చెందిన షాకీర్ బిన్ అవాస్ ఆటోను అద్దెకు మాట్లాడుకొని గంజాయిని పటాన్‌చెరుకు తరలిస్తున్నారు. ఆదివారం లింగంపల్లి చౌరస్తా వద్ద స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానంతో షాకీర్ బిన్ అవాస్ ఆటోను ఆపి తనిఖీ చేయగా 30కిలో గంజాయి లభించింది. అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. ముగ్గరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పదవులు శాశ్వతం కాదు.. వ్యక్తిత్వం ముఖ్యం

కేంద్ర సాహిత్య అకాడమీ
మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి


మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి

గజ్వేల్‌రూరల్: వ్యక్తికి పదవులు శాశ్వతం కాదని, వ్యక్తిత్వమే ముఖ్యమని కేంద్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ భవాణి, జిల్లా ఐడెంటిఫైడ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్, గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పీవీ ఉమాశశి, సిద్దిపేట డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పాపయ్య, చెప్పల హరినాథశర్మ, మున్సిపల్ చైర్మన్ రాజమౌళితోపాటు డాక్టర్ ఆకుల నరేశ్ బాబు, లక్ష్మణ్, డాక్టర్‌పద్మజ్యోతి, సుభాష్‌చంద్ర బోస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


సైనిక


సందీప్

మిరుదొడ్డి(దుబ్బాక): హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ అడ్మిషన్ల కోసం జరుగుతున్న ఈవెంట్ పోటీ పరీక్షల్లో అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ఈవెంట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కిషన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న గుర్రాల సైనిక, ఎర్మని సందీప్ జిల్లా స్థాయిలో జరిగిన 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బోర్డు జంప్, మెడిసిన్ బాల్ పుట్, 6 నుంచి 10 మీటర్ల షటిల్ రన్, ఫ్లెక్సిబులిటీ టెస్టులు, స్టాండింగ్ వర్టికల్ జంప్, 800 మీటర్ల రన్నింగ్‌లో ప్రతిభను కనబర్చారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 8 నుంచి 12 వరకు హైదరాబాద్‌లో జరిగే ఈవెంట్లలో ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చితే తమ విద్యార్థులు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులను హెచ్‌ఎం పీఈటీ స్వామి, ఉపాధ్యాయులు కరుణాకర్, శ్రీనివాస్, శ్రీవిద్య, రాజేశ్వరి అభినందించారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు

ఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు


వినతులు పరిశీలిస్తున్న ఎస్పీ బాలస్వామి

మెదక్ మున్సిపాలిటీ: నా భర్త అదనపు కట్నం వేధిస్తున్నాడని, విచారణ జరిపి న్యాయం చేయాలని తూప్రాన్ మండలం హైదర్‌గూడకు చెందిన కేశమైన అండాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బాలస్వామి ప్రజావాణి నిర్వహించారు. ఈసందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ.. 2003లో పెద్దల సమక్షంలో పెళ్లి జరిగిందని, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపింది. మూడేళ్లుగా తన భర్త మహేష్ అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. వేధింపులు భరించలేక తూప్రాన్‌లో అద్దెకు ఉంటున్నట్లు వాపోయింది. పాలివారు మాకు రావాల్సిన భూమి భాగం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని శివ్వంపేట మండలం లింగోజీగూడకు చెందిన దొంతి సుజాత ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్పీ చట్ట ప్రకారం ఫిర్యాదిదారులకు తగిన న్యాయం చేయాలని ఆయా మండలాల పోలీస్ అధికారులకు సూచించారు.

తల్లీకూతురు అదృశ్యం

వెల్దుర్తి(తూప్రాన్): తల్లీకూతురు అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శంశిరెడ్డిపల్లి తండా పంచాయతీకి చెందిన ముడావత్ రవీంద్రనాయక్, సునీత దంపతులు కొన్నేళ్లుగా మేడ్చల్ శివారులో నివాసం ఉంటున్నారు. గత నెల 26న ఉదయం బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికొచ్చే లోపు ఇంట్లో భార్య సునీత, కూతురు వైష్ణవి లేరు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలేజీకి వెళ్లి యువతి..

మనోహరాబాద్(తూప్రాన్): యువతి అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెట్లగౌరారం గ్రామానికి చెందిన మంగళి శ్రీనివాస్, రేణుక కుమార్తె రమ్య (19) గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. శనివారం కాలేజీకి వెళ్లిన యువతి సాయంత్రమైనా ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. రమ్య తల్లి రేణుక సోమవారం మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లక్ష ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

హాస్టల్‌లో తనిఖీలు

సంగారెడ్డి టౌన్: నాసిరకం ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేంద్ర అన్నారు. సోమవారం సంగారెడ్డి మండలంలోని ఎమ్మెన్నార్ కళాశాలలోని హాస్టల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హాస్టల్‌లోని వంటగది అపరిశుభ్రంగా ఉందని నాణ్యత గల వస్తువులను వాడాలని ముడి సరుకులు నాణ్యతగా లేనట్టు అనుమానాలు ఉన్నాయని నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించామన్నారు.

బైక్‌ల దొంగలు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బాలస్వామి

తూప్రాన్: ఉమ్మడి మెదక్ జిల్లాలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ బాలస్వామి పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్‌లో డీఎస్పీ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని మక్త మైలారం గ్రామానికి చెందిన బుర్గుపల్లి స్వామి, మల్లేశ్ వరుసకు ఇద్దరు అన్నాదమ్ముళ్లు. పట్టణంలోని పోతరాజుపల్లి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంలో అనుమానాస్పదంగా ఇద్దరిని పట్టుకొని విచారించగా దొంగతనాలు ఒప్పుకున్నట్లు తెలిపారు. వరుసకు బంధువైన అదే గ్రామానికి చెందిన మల్లేశ్‌తో కలిసి స్వామి సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో బైక్ దొంగతనం చేశారు. అలాగే, కుకునూరుపల్లి మండలంలో రెండు బైక్‌లు, గజ్వేల్ పట్టణంలో ఒకటి, అనంతరం తూప్రాన్ మండలంలో మూడు, మనోహరాబాద్ మండలంలో రెండు బైక్‌లు దొంగతనం చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్పీ పేర్కొన్నారు. తొమ్మిది బైక్‌ల యాజమానులను గుర్తించామని, మరో మూడు బైక్‌ల యాజమానులను గుర్తించాల్సి ఉందన్నారు. బైక్‌లను రికవరీ చేసిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, ఎస్‌ఐలు శివానందం, యాదగిరి, కానిస్టేబుల్స్ సురేశ్, కృష్ణ, నాగేందర్‌బాబులను ఎస్పీ అభినందించారు.

ఇద్దరు రిమాండ్

పాపన్నపేట (మెదక్): ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ రూరల్ సీఐ కేశవులు, పాపన్న పేట ఎస్సై నరేశ్ తెలిపారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. టేక్మాల్ మండలం ఎల్లంపల్లి తండాకు చెందిన దేవసోత్ రాజు అలియాస్ బట్టు, దేవసోత్ రాజు చోరీలకు పాల్పడుతున్నారు. గత నెల 24న పాపన్నపేటలోని వీరభద్ర కిరాణంలో నగదు, బంగారం, వెండి వస్తువులతో పాటు, ఎల్‌ఈడీ టీవీ, డీవీఆర్ ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ఘటనా స్థలంలో లభ్యమైన నిందితుడి బ్లూటూత్ ఇయర్ ఫోన్ ద్వారా ఇద్దరినీ గుర్తించారు. సోమవారం అరెస్టు చేసి పదిన్నర తులాల బంగారు నగలు, రెండు తులాల వెండి, రూ.14 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ నరేశ్, కానిస్టేబుల్ లను సీఐ అభినందించారు.

దొంగల హల్‌చల్

వైన్స్, బేకరీ, మొబైల్ షాపులో చోరీలు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఆదివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పట్టణంలోని తిరుమల వైన్స్ గోడకు కన్నం వేసి కౌంటర్‌లోని రూ.31 వేలు నగదుతోపాటు రూ.59 వేలు విలువ జేసే మద్యం కాటన్‌లను ఎత్తుకెళ్లారు. దుకాణంలోని సీసీ కెమెరాల డీవీఆర్ ధ్వంసం చేసి, రోజువారి విక్రయాలు, స్టాక్‌లకు సంబంధించిన రికార్డులు పత్రాలు, మద్యం ఖాళీ కాటన్‌లతో డీవీఆర్ తగులబెట్టారు. గ్రామంలోని బెంగుళూర్ అయ్యంగారి బేకరీ, చందు మొబైల్ షాప్‌లో చోరీకి ప్రయత్నించారు. గ్రామశివారులోని రైతుబజార్ వెనుకభాగంలో గల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని విలువైన కాపర్ పరికరాలను అపహరించారు. ఘటనా స్థలాన్ని తూప్రాన్ సీఐ రంగకృష్ణ, వెల్దుర్తి ఎస్‌ఐ నవత సందర్శించి క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు.

తల్లి ఎదుటే కుమారుడు మృతి

ట్యాంకర్‌ను ఢీకొట్టిన బైక్

హవేళిఘణాపూర్(మెదక్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మెదక్ మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. టేక్మాల్ మండలం ఏల్పుగొండ గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్(22), తల్లి ప్రమీలతో కలిసి హైదరాబాద్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. మాచవరం గేటు సమీపంలోకి రాగానే మెదక్ వైపు వెళ్తున్న ట్యాంకర్‌ను వీరి బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రేమ్‌కుమార్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి ప్రమీలకు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కళ్ల ఎదుటే కుమారుడు ప్రాణాలు వదలడంతో ఆ తల్లి బోరున విలపించింది. ఘటనా స్థలాన్ని ఏఎస్‌ఐ వెంకటయ్య సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ఆస్పత్రికి తరలించారు.

మట్టిపెడ్డలు పడటంతో మహిళ..


శ్యామల(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): చెరువులో మట్టి తవ్వుతుండగా మట్టి పెడ్డలు పైన పడటంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భుజిరంపేట గ్రామానికి చెందిన సంది బోరంచ, అతడి భార్య శ్యామల(35), కొడుకుతో కలిసి ఆదివారం సాయంత్రం ఇంటి అవసరాల కోసం ట్రాక్టర్‌లో మట్టి తెచ్చేందుకు స్థానిక నేరడి చెరువులోకి వెళ్లారు. జేసీబీ గుంతలో మట్టి తవ్వుతుండగా పైన ఉన్న మట్టిపెడ్డలు శ్యామల పైన పడ్డాయి. దీంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. మట్టిని తొలగించేసరికి ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలి తండ్రి దాదె కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆటో డ్రైవర్..

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంతో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన కాసా శ్రీనివాస్ గౌడ్(42) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఆటోను తడి బట్టతో తుడిచి ఆ బట్టను బిల్డింగ్‌కు అనుకొని ఉన్న ఇనుప వైర్ దండంపై వేశాడు. అప్పటికే బిల్డింగ్ పై కరెంట్ వైర్ పడి ఇనుప వైర్‌కు విద్యుత్ సరఫరా అవుతుంది. తడి బట్ట వేయగానే కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పుట్టిన రోజు నాడే యువకుడు..

గజ్వేల్‌రూరల్: రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డును ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గజ్వేల్ సీఐ సైదా కథనం మేరకు.. హైద్రాబాద్‌లోని బేగంపేట ప్రాంతంలో గల బాలంరాయ్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి నోవెల్ రోషన్(28) పుట్టిన రోజు సందర్భంగా వర్గల్ మండలం నాచారం దేవస్థానానికి మిత్రుడు జోతాన్‌పాల్‌తో కలిసి బైక్‌పై వచ్చాడు. తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో మద్యం తాగి గజ్వేల్ మండలం కోమటిబండ నుంచి రింగు రోడ్డు వైపు వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డును బైక్‌తో ఢీకొట్టారు. రోషన్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, జోతాన్‌పాల్‌కు గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

యువకుడు ఆత్మహత్య


ఆనంద్‌రాజ్(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): జీవితంపై విరక్తితో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం బూర్గుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మరెల్లి పోచయ్య మూడవ కుమారుడు మరెల్లి ఆనంద్‌రాజ్ (28) రోజుమాదిరి తల్లిదండ్రులు కొత్త ఇంట్లో నిద్రించగా ఆనంద్‌రాజ్ పాత ఇంట్లో నిద్రించాడు. ఉదయం 10 గంటలైనా లేవకపోవడంతో గమనించిన తల్లిదండ్రులు తలుపులు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు కనిపించాడు. వెంటనే హవేళిఘణాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ చేరుకొని పరిశీలించి కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.